# జూలి

మరోక్షణంలో మెయిల్ కదలబోతుందనగా సావిత్రికి చిన్న పార్సిల్ తెచ్చిచ్చాడు వాళ్ళ అన్న. అతను పార్సిల్ చేతికి అందించాడు; రైలు కూతకూసి, స్టేషన్‌లోంచి కదిలింది. కనపడేదాకా తలచాచి చూసింది సావిత్రి అన్న వంక. రైలుగమనం హెచ్చడంతో సావిత్రి సర్దుకుని, తన బెర్తుమీద చతికిలబడింది. కంపార్టుమెంటులోని నాలుగు బెర్తుల్లో ఒకటి ఖాళీగావుంది. మిగతా మూడింట్లో సావిత్రి ఒకటి; సావిత్రి భర్తవొకటీ ఆక్రమించుకొన్నారు. మూడో బెర్తులో ఎవరో దొరగారు కూచున్నాడు.

భర్త పైపు వెలిగించాడు. సావిత్రి నెమ్మదిగా పార్సిల్ విప్పి ఒక్కొక్క పత్రికా, పుస్తకం చూస్తోంది. కలకత్తా వెళ్ళేదాకా సరిపడ్డన్ని పత్రికలూ పుస్తకాలూ తెచ్చిచ్చాడు అన్నగారు. తోచదన్న బాధ లేకుండా హాయిగా గడచిపోతుంది టైము.

ఎదురుగావున్న దొరగారు పొడుగాటి సిగార్ ముట్టించి చీకట్లోకి తీక్షణంగా చూస్తున్నాడు.

"అమ్మయ్య! తోచదు అన్న యిబ్బంది లేకుండా నీకు కావలసినన్ని పత్రికలు" అంటూ భర్త 'రీడర్సు డైజెస్టు' లాక్కున్నాడు సావిత్రి దగ్గరనుంచి.

"మరెలాగా? రెండురోజులు రైల్లోవూరికే కూచోవాలంటే పిచ్చులూ వెర్రులూ ఎత్తుతుంది" అంది సావిత్రి.

"ఈమధ్య అసలు వూపిరి సలపడంలేదు. యీా రెండు రోజులూ హాయిగా రెస్టుతీసుకుంటాను" అంటూ భర్త బద్ధకంగా వొళ్ళు విరుచుకున్నాడు.

సావిత్రి ఒకటొకటే పత్రికల్లోని బొమ్మల్ని చూస్తోంది. సావిత్రి పత్రికల్ని రెండు విధాలుగా విభజిస్తుంది. ఒకటి బొమ్మల పత్రికలు, రెండు రీడింగ్ మేటరున్నవి. మొదట బొమ్మలున్నవి చూడటం కానిచ్చి, తర్వాత కథలూ, ఆర్టికల్సూ, యిలా పూర్తి చేస్తుంది. "పత్రికలన్నీ అయాక నావెల్సు" అని పుస్తకాలన్నీ దొంతరగా ఒకపక్కన పెట్టింది.

రైలుకంటే వేగంగా పరిగెత్తేది కాలం. రాత్రి పది అయింది. ఈలోపల భర్త ఫ్లాస్కులోని కాఫీ తాగాడు. నాలుగుసార్లు పైపు వెలిగించి అరడజనుసార్లు ఆవలించాడు. ఎదురుసీట్లో దొరగారు కదలక మెదలక విగ్రహంలా కూచుని సిగార్ వెనుక సిగార్ ముట్టిస్తున్నాడు.

"లైటు ఆర్పేసి పడుకోరాదూ?" అన్నాడు భర్త తన బెడ్ మీాదకి వొరుగుతూ.

సావిత్రి మాట్లాడకుండా తమ వైపునున్న పెద్దలైటు ఆర్పి, బెర్తుకి తలాటిదిక్కున వున్న బెడ్‌లాంపు స్విచ్ వేసి చదువుకోవడం మొదలెట్టింది.

భర్త నిద్రపోయాడు. దొరగారు అలాగే కిటికీదగ్గర కూచుని, చీకట్లోకి చూస్తున్నాడు. తను పడుకునేదాకా అంటే రాత్రి ఒంటిగంటదాకా, దొరగారు అలా కూచుని చీకట్లోకి చూడటం సావిత్రి కనిపెడుతూనే ఉంది.

o o o o

సావిత్రికి నిద్ర మెళుకువ వచ్చేవేళకి బెజవాడ దాటి పోయింది. ఏలూరు సమీపిస్తున్నారు. భర్త లేచి బెడ్ కాఫీ తాగుతూ, లైఫ్ పత్రిక పేజీలు తిరగేస్తున్నాడు. దొరగారు యథాప్రకారంగా కిటికీలోంచి సూర్యోదయాన్ని చూస్తున్నాడు. తెల్లవార్లూ నిద్రపోకుండా అలానే కూచున్నాడా – అని సావిత్రికి క్షణకాలం అనుమానం తోచింది.

సావిత్రి బాత్‌రూమ్‌లోకెళ్ళి – మొఖం కడుక్కొని, చీరె మార్చుకునివచ్చి – తనవంతు కాఫీ తీసుకుంటూంటేగా దొర ఆప్యాయంగా నవ్వుతూ "గుడ్ మార్నింగ్" అన్నాడు. సావిత్రి "గుడ్‌మార్నింగ్" అంటూ తిరిగి విష్ చేసి–భర్తతో కబుర్లకి దిగింది.

రైలు నిడదవోలు వచ్చాక బ్రెక్‌ఫాస్టు వచ్చింది – ముగ్గురికీని. దొర చాలా నిశ్శబ్దంగా తిన్నాడు తన బ్రెక్‌ఫాస్టుని. సావిత్రి భర్త పేపర్లోని స్పోర్ట్సుకాలమ్ చాలా శ్రద్ధగా చదువుతూ బ్రెడ్ కొరుకుతున్నాడు. సావిత్రి తన కప్పులోకి వేడివేడి కాఫీ వంచుకు తాగుతోంది,–మధ్యమధ్య పొలాల్లోని పల్లెపడుచుల్ని చూస్తూ.

దొరగారు కూచున్నవైపు ఎండ బాగా పడటంతో ఆయన కిటికీ తలుపు మూసివేసి వీరివైపు తిరిగాడు. దొర సావిత్రి భర్తవైపు తిరిగి, "వైజాగ్‌దాకా మనం ముగ్గురమే అనుకుంటూ ఉండేది. అక్కడ మరొకరు ఎక్కితే ఎక్కవచ్చు. అన్నాడు ఇంగ్లీషులో.

"నూడొంతులు అక్కడా యెవరూ ఎక్కరు. ప్లేన్ మీద కలకత్తా పోవడం తేలిక. అదీగాక ఫస్ట్‌క్లాస్ టిక్కెట్టు

మధ్యస్టేషన్సులో సాధారణంగా ఎవరూ కొనరు" అన్నాడు సావిత్రి భర్త.

దొరకి మాట్లాడటం కూడా వచ్చునా అన్నట్టు చూస్తోంది సావిత్రి. దొర వయసు యాభై అరవై మధ్యన వుంటుంది. తలమీద ఒక వెంట్రుకకూడా లేదు. తలరంగూ ముఖంరంగూ ఒకేవిధంగావున్నాయి. కళ్ళునీలంగా, సూదుల్లా చూస్తూవుంటాయి యితర్లవంక. ముఖం ఎర్రగా కోపంవచ్చిన వాడిమాదిరి కందగడ్డలా వుంది. బహుశా ఆ ఎర్రదనం హిందూదేశపు తాపంవల్లనేమో అనుకుంది సావిత్రి. ముంజేతులమీదనున్న ఎర్రవెంట్రుకలు, మధ్య మధ్య నీలంగా కనిపించే నరాలూ; తమాషాగా చూస్తూసావిత్రి వారిసంభాషణని పరధ్యాన్నంగా వింటోంది.

"నాపేరు జాన్‌స్టన్. ప్రస్తుతం బెంగాలులో వుంటున్నాను. రెండుమూడేళ్ళలో రిటైరైపోతాను" అంటున్నాడు మిస్టర్ జాన్‌స్టన్.

"నాపేరు రావ్. ఇంజనీరింగ్ కంట్రాక్టర్ని. మకాం మద్రాసు" అన్నాడు సావిత్రి భర్త.

వాళ్ళిద్దరూ రాజకీయాలు మొదలుకొని, వర్షాలుపడక పోవడానికి కారణాలదాకా మాట్లాడు కుంటున్నారు. కొన్ని విషయాలు సావిత్రి చెవుల్లోకి దూరినాయి; మరికొన్ని గాలిలో కలిసిపోయినాయి; "అర్గొసీ"లోని కథ ఎంతో బావుంది సావిత్రికి. ఇంతలో సామర్లకోట వచ్చింది. జాన్‌స్టన్‌గారు మూడు డిన్నర్స్ ఆర్డర్ చేశాడు.

"సారీ, మా ఆవిడ స్ట్రిక్ట్ వెజిటేరియన్ - ఆవిడకు సాంబార్ సాదమే కావాలి. టూ డిన్నర్స్, బాయ్," అన్నాడు రావు.

"అరె—ఆవిడ చాలా మోడరన్ వుమన్‌లా వున్నారే. మీట్ తినరా ?" అన్నాడు దొర ఆశ్చర్యంతో.

"మోడరన్ వుమన్‌కీ-మీట్‌కీ సందర్భం ఏముంది ? నేనా భోజనం తినుకోను. మన మీల్సు నాకు తెప్పించండి" అంది సావిత్రి భర్తతో తెలుగులో.

"సారీ. నో అఫెన్సు. మీకు అలాటి అభ్యంతరాలు లేవనుకున్నాను. పోనీ మీకు మామూలు మీల్సు తెప్పిస్తాను" అంటూ ముగ్గురికి ఆర్డరు చేశాడు, స్వచ్ఛమైన తెలుగులో జాన్‌స్టన్ దొరగారు.

సావిత్రికి, భర్తకి, ఆయన తెలుగు వినేసరికి ఎంతో ఆనందం కలిగింది.

"మీకు తెలుగు వచ్చునా ?" అని అడిగింది సావిత్రి.

"ఆఁ మొట్టమొదట నేను కృష్ణాజిల్లా సబ్ కలెక్టరుగా వచ్చాను. అక్కడ రెండేళ్ళు పనిచేశాను. ఆ పైన మళ్ళీ వైజాగ్ డిస్ట్రిక్టులో నాలుగేళ్ళు వున్నాను. అంచేత తెలుగు బాగా వచ్చింది" అన్నాడు చిరునవ్వుతో దొర.

ఆ తర్వాత వాళ్ళ సంభాషణ చాలా మటుకు తెలుగులో యింగ్లీషులో-యిలా రెండు భాషల్లోనూ నడిచింది.

సామర్లకోటనుంచి సింహాచలంకొండ వచ్చేదాకా దొరగారూ, రావుగారూ, చదరంగం పెట్టుకుని ఆడుతూ కూచు

న్నారు. వైజాగ్‌లో కూడా ఎవరూ ఎక్కలేదు. వాళ్ళపెట్టెలో దొరగారు బిస్కట్స్ - చాకిలెట్లూ చాలా కొని తెచ్చారు వైజాగ్ స్టేషనులో. అక్కడే టీ పుచ్చుకున్నారు ముగ్గురూనూ.

సాయంత్రం అయిదున్నరా ఆరూ అయింది. రైలు సింహాచలం కొండల దగ్గిరనుంచి పోతోంది. ఎండవేటవాలుగా పడుతోంది. యీసారి ఎండవాలు సావిత్రి కూచున్న బెర్తు మీద పడుతోంది. కిటికీ తలుపులుమూసి, సావిత్రి "మిర్రర్" మాగ్జయిన్ పూర్తి చేసింది.

చెస్ మరొక ఆటతో పూర్తి అయిపోయింది. సావిత్రి భర్త వైపు వెలిగించాడు. దొరగారు సిగార్ వెలిగించి, గడిచిన రాత్రిలాగా కిటికీలోంచి కొండలవంక తేరిపార చూస్తూన్నాడు. కంపార్టుమెంటు చాలా నిశ్శబ్దంగా వుంది. సావిత్రికి చదువుకోబుద్ధి పుట్టలేదు. ముఖం కడుక్కొని, చీరె మార్చుకుని, ఓ కప్పు కాఫీతాగి, సీటుమీద కూర్చుంది. దొరగారి వీపు శిలలాగ కదలక మెదలక వుంది. అసలు మాట్లాడకపోతే బాగా వుండేది, కాని మధ్యాహ్నంనుంచి కబుర్లుచెప్పిన దొర మళ్ళా గూడులోకి వెళ్ళినట్టు, అలా నిశ్శబ్దాన్ని కప్పుకు కూచోడం బాగాలేదు. కాని అతన్ని పల్కరించడంగాని, భర్తని పల్కరించడంగానిచెయ్యలేకపోయింది సావిత్రి. అలాగే కూర్చుండిపోయింది. కంపార్టుమెంటులోని లైటు వెలిగించింది. బయట చీకటి ఆవరించుకున్నది. భర్త చిన్న కునుకుతీసి లేచి టైమెంతయింది?" అని ప్రశ్నించాడు భార్యని.

సావిత్రి వాచీ చూసింది. అప్పుడే ఎనిమిది అయింది. ఎప్పుడూ రైలుకంటే వేగంగా పరుగెత్తేది కాలమే.

దొర కిటికీవైపునుంచి తనవైపుకి తిరిగాడు "ఈ కొం డల్ని ద్వేషించినంత మరింకదేన్నీ ద్వేషించను" అన్నాడు ముఖం కందగడ్డలా చేసుకుని.

సావిత్రికి అమితాశ్చర్యం కలిగింది. జీవంలేని, చలన రహితమైన, ఆపర్వతాల్ని మానవుడు ద్వేషించడమా ? అర్థంకాకుండా వుంది.

"అసలు యీ కొండల్నే కాదు, యీఇండియామీదనే నాకింత కసి; ప్రతిక్షణం యీ దేశాన్ని ద్వేషిస్తూనే యిక్కడ బతుకుతున్నా" అన్నాడు జాన్‌స్టన్‌గారు ఇంగ్లీషులో, ఏదో కటువుగా.

భార్యా భర్తలిద్దరికీ ఆమాటలు అమితాశ్చర్యాన్ని కల్గించాయి. ఈ దొర భారతదేశాన్ని అంత ద్వేషిస్తూ— అదే దేశంలో ఎందుకు గడపాల్సివచ్చింది-అనే ప్రశ్న యిద్దరి మనసుల్లో ఒకేసారి వుద్భవించింది.

"ద్వేషించడం తేలిక-ప్రేమించడం కష్టం" అన్నాడు, సావిత్రి భర్త చాలా నెమ్మదిగా.

"ఆ సూక్తులు, ఆ ధర్మాలూ నాకు తెలియనివా ? నా జూలీని మాయంచేసిన ఈకొండల్ని ఏనాటికి క్షమించలేను. పన్నెండేళ్ళనుంచి వీటిని దాటినప్పుడల్లా శపించకుండా వెళ్ళ డంలేదు నేను-" అన్నాడు చాలా తీవ్రంగా. నుదుటిమీద స్వేదబిందువులు మెరుస్తున్నాయి. ముఖం ఎర్రగా, మరీఎర్రగా బీట్‌రూట్ దుంపని జ్ఞాపకానికి తెస్తూవుంది. పాపం ! ఈఅభా గ్యుడి భార్య పోయింది కాబోలనుకున్నారు. సావిత్రీ - ఆమె భర్తా.

"ఏం జబ్బుచేసింది" అని ప్రశ్నించాడు సావిత్రి భర్త దొరని మాటల్లోకి లాగి.

"చచ్చిపోలేదు, నాకంటె తక్కువవాడితో పారిపోయింది" అన్నాడు దొర చాలా నిదానంగా.

పిడుగుపడ్డట్టు అనిపించింది ఆవార్త వారికి. ఏదో చొరరాని ప్రదేశంలోకి ప్రవేశించినట్టూ, దొంగతనం చేస్తూవుంటే పట్టుబడ్డట్టు, భార్యాభర్తలిద్దరూ సిగ్గుపడ్డారు.

"అసలు యీదేశం రావడంతో నే-నా జీవితం నాశనం అయింది. అందులో ఈ పాపిష్టి కొండలమధ్య వుండటంవల్ల-నన్ను జూలీవదిలి వెళ్ళిపోయింది. అందుకే యీ కొండల్నీ ఇండియానీ ద్వేషించకుండా వుండలేను" అన్నాడు దొర వుద్రేకంగా.

భార్యాభర్తలిద్దరూ సమాధానం చెప్పలేదు. మరో సిగార్ ముట్టించి, ఎవరూ ఏమీ ప్రశ్నించకుండానే మొదలు పెట్టాడు దొర, తెగిన సంభాషణని.

"గ్లాస్గోలో పుట్టాను. చిన్నప్పుడు నాన్న తెగతాగి. అమ్మను కొట్టడంచూసి-అప్పుడే మనసులోఒట్టుపెట్టుకున్నాను, ఎప్పుడూ మద్యం ముట్టుకోరాదనీ, స్త్రీని ద్వేషించక గౌరవించి పూజించాలనీను. కాని జూలీ నా ఆదర్శాలన్నీ మంట కలిపింది. స్త్రీజాతిని ద్వేషించేటట్టు చేసింది." దొర ఆగిపోయాడు. రైలు పరుగెడుతోంది. చుట్టూ చీకట్లు. ఎవరూ కదలడంలేరు. అసలు రెప్పలెత్తి ఒకరివంక మరొకరు చూడటంలేదు.

సావిత్రి లేచి పెద్దలైటు ఆర్పి, బెడ్‌లాంప్ స్విచ్ ఆన్ చేసింది. యీ అపరిచితుని, ఈ శ్వేతవర్ణుని దుఃఖితగాథ యీ రాత్రి వినకతప్పదు. అది ధగధగ మెరిసే దీపకాంతిలో కంటే, ప్రకృతిమాత కటికిచీకట్లో వినడం నయం – అనుకుంది.

దొర మళ్లీ మొదలుపెట్టాడు: "తాగుడుతో నాన్న చచ్చిపోయాడు–నా పద్నాలుగో యేట. అప్పటికే అమ్మ కుట్టు పనులతో, పాచిపనులతో డబ్బు సంపాయిస్తూ వుండేది. నేను స్కూలు వేళతప్ప మిగతా వేళల్లో ఏదో ఒకపని, మంచు ఎత్తి పొయ్యడంనుంచి పార్శిల్సు మొయ్యడందాకా ఏదో ఒకపని చేసి నాకు సరిపడిన డబ్బు సంపాయించుకుని, చదువుకొంటూ వుండేవాణ్ణి. ఆ రోజులలో నాకు రెండేవుద్దేశాలు – తాగడం మహాపాపం అనీ, స్త్రీ జాతిని నెత్తినపెట్టుకు పూజించాలనీను.

"కాలేజీలో చేరాను. అన్ని పరీక్షల్లో మంచిమార్కులతో చక్కగా పాసయ్యాను. ఫలితాలు తెలిసిన నాటి రాత్రి అమ్మ కళ్ళలోని ఆనందభాష్పాలు, నేను నా మరణశయ్య మీదకూడా మర్చిపోలేను.

నేను కాలేజీలో చదువుతుండగా చివరియేడు జూలీతో పరిచయం అయింది. జూలీ మా కాలేజీ లైబ్రరీలో టైపిస్టు. నన్ను ఆకర్షించింది జూలీ సౌందర్యంకాదు, ఆమె సౌమ్యత. యిద్దరం ప్రతి సాయంత్రం అలా సందులమ్మట, రోడ్లమ్మట నడిచి, పార్కుబెంచీలమీద కూచుని మా భవిష్యత్ గురించి కలలు గనేవారము. ఆడంబరంలేని జూలీ నా కలలన్నీ పంచుకునేది.

° ° °

"నా కాలేజీ అయిపోయింది. జూలీకీ నాకూ ఎంగేజ్మెంట్ అయింది. అమ్మ జూలీని కన్నకూతురిలా ఆదరించి ప్రేమించింది. ఇంతలో ఇండియాకు రావడంతో, పెళ్ళి ఆపుచేసుకోవాల్సి వచ్చింది. ఆరోజున హార్బరులోని జూలీ కంటినీరు, నన్ను ఇండియాలోవున్న రెండేళ్లూ వెన్నాడుతూనే వుంది. ఎదురుగుండా మనిషి లేకపోయినా, చేతల్లో ఆలోచనల్లో నాపక్క సర్వవేళలా నీడలా వున్నట్టే తోచేదామె.

"స్వదేశంవదలి, తల్లినీ, ప్రేమించిన ప్రియురాల్ని వదిలి యీ దేశం వచ్చాను. పొట్టకూటికి అనుకున్నారా ? కాదు. ఏ గడ్డమీదైనా రోజులు గడవకపోవు. జూలీ నేనూ కలిసి నిర్మించబోయే మా చిన్ని ప్రపంచానికి పునాది భారతదేశం అని నమ్మివచ్చాను. కాని నా ఆశయాలూ, ఆలోచనలూ అన్నీ కూకటివేళ్ళతో పడిపోయాయి. యీనాడు ఈ దేశాన్ని వదలలేను, ప్రేమించలేను. ద్వేషిస్తూనే యిలా ఈ నేలమీదనే జీవితభారాన్ని మొయ్యాలి" అంటూ నిట్టూర్పు విడిచాడు దొర.

బెడ్‌లాంప్‌చుట్టూ పురుగుఒకటి గిరగిర తిరుగుతోంది. పాపం ! దీపాన్ని పండు అని భ్రమించి, ఆ దీపపువేడిలో ఆహుతి అయిపోతుంది. ఈ దొరకూడా శలభం లాటివాడే కాబోలు. భారతావనిలో అతని హృదయం మగ్గిపోయింది కాబోలు ?

"కృష్ణాజిల్లాలో మొట్టమొదట సబ్‌కలెక్టరుగా పనిచేశాను. రెండేళ్ళ అనంతరం నన్ను వైజాగ్‌కి బదిలీచేశారు. అప్పుడే శలవు తీసుకున్నాను రెండునెలలు. స్వదేశానికి తిరిగి

వెళ్ళాను. జూలీ, నాజూలీ, నాకోసం హార్బరులో ఎదురుచూస్తోంది. వారంరోజుల లోపలే పెళ్ళిచేసుకున్నాను జూలీని. హనీమూన్ నెల్లాళ్ళుఅయ్యాక భారతదేశానికిబయలుదేరాము. వృద్ధాప్యంలో అమ్మ స్వదేశం వీడి, దూరదేశానికి రానంది. ఆమెకి నెలనెలా కొంతడబ్బు పంపిస్తూ ఆమె ఒక సీసైడ్ హోటల్‌లో వుండేటట్టు ఏర్పాటు చేశాను.

"జూలీ నేనూ వైజాగ్‌వచ్చాం. ఈకొండల్నీ సూర్యోదయాన్నీ, ఈపచ్చని చెట్లనీ చూసి జూలీ యిది వండర్లాండ్ అని మురిసిపోయింది. ఒకఏడాది జూలీ నేనూ స్వర్గంలో విహరించాము. నేను కాంప్‌కి వెళ్ళిన సమయం చూసుకు వైజాగ్ హార్బరులో పనిచేస్తున్న ఒక తెల్లవాడిని తీసుకుని - కలకత్తా పారిపోయింది జూలీ. తనకి ఈ ప్రదేశం ఏమీ నచ్చలేదట. తిరిగి లండన్ వెళ్ళిపోతున్నాననీ, తనను వెతుక్కోవద్దనీ వుత్తరంరాసి వెళ్ళిపోయింది..." దొరగారు ఆగాడు. అతను ఒక్క నిట్టూర్పువిడిచి, బూటుకాలిని ఒకసారి విదిలించాడు.

"జూలీ - నా భార్య - నా హృదయరాణి లేనిదే నేనెల్లా జీవించను? నాకు లోకమంతా చీకటయిపోయింది. కలకత్తా పరిగెత్తి జూలీని వెతికిపట్టుకుని, బతిమాలాను, ఏడ్చాను. తిరిగి రానందిజూలీ. పోనీ, ఉద్యోగం మానేస్తాను, యిద్దరం లండన్ వెళ్ళిపోదామురమ్మనమన్నాను. జూలీ తిరిగిరానంది. నా మొహం చూడనని చెప్పింది. వెనక్కివచ్చాను. ఏంచెయ్యను! హృదయంలోని యీ మంట ఎలా చల్లారుతుంది? చచ్చిపోతే...చావడం చాలా తేలిక. నాదగ్గిరున్న రివాల్వరుతో ఒక్కసారి ప్రాణంతీసుకోవచ్చు. కాని నాతల్లి జ్ఞాపకంవచ్చి

ఆ పని చెయ్యలేకపోయాను; జీవచ్ఛవంలా బతుకుతున్నాను. ఏ తాగుడినైతే అసహ్యించుకున్నానో - జూలీని మర్చిపోయేందుకు ఆ తాగుడే నాకు శరణ్యం అయింది.

"మరో ఏడాదిలో అమ్మ చచ్చిపోయింది. అమ్మ మరణవార్త వినికూడా లండను వెళ్ళలేదు. మాకు తెలిసిన ఫాదరీచేత ఆమె అంత్యక్రియలు చేయించాను. నన్ను ప్రేమించే ఆ ఒక్క స్త్రీకూడా చనిపోయింది. మిగిలిన స్త్రీలంతా దగాకోర్లు, అంతా నటన. ఈ దేశం నా దేవత జూలీని రాక్షసికింద మార్చింది. నన్ను సర్వనాశనంచేసిన స్త్రీజాతినీ భారతదేశాన్నీ ద్వేషించకుండా ఎలాఉండగలను?" అన్నాడు దొర ఆయాసంగా.

"భారతదేశం నిమిత్తమాత్రం. జూలీమిమ్మల్ని ఎక్కడవున్నాసరే వదిలి వెళ్ళిపోయేదే. ఆ పోవడానికి దేశంకాదు కారణం; ఆమెచపలత్వం" అంది సావిత్రి, అందామని అనుకోకుండానే.

"ఇలాంటి మాటలు నేను చాలా విన్నాను. కర్మ, పాపఫలం, విధికృతం-యీ రకం మాటలు చాలా విన్నాను. వివేకానందుని రచనలుచదివాను, రమణమహర్షిని చూశాను. అరవిందుని సాన్నిధ్యంలో ఆత్మ శాంతికోసం ఆరాటపడ్డాను. కాని ఆమాటలు వింటున్న కాసేపు శాంతిబోధకంగావుంటయి గాని-ఆ తర్వాత మిగిలేది మళ్ళా మామూలు ఆరాటమే. మాది ఆధ్యాత్మిక దేశం అని మీరు చెప్పుకుంటారు. అదేదో అర్థం చేసుకోవాలని సన్యాసుల్నీ, సాధువుల్నీ ఎందరెందర్నో పల్కరించాను. కాని నాకు శాంతిరాలేదు. ఎటొచ్చీ వుద్వే

తంలో మొదలెట్టిన త్రాగుడు, అమ్మ మరణానంతరం మానేశాను. అదికూడా నా మానసిక బలంవల్లనే! దేవతలాంటి నా జూలీ రాక్షసి అయ్యింది. ఈ దేశం దేవతల్ని రాక్షసులుగా చేస్తుంది" అన్నాడు దొర.

"పోనీ, మీరు లండను తిరిగి వెళ్ళకపోయారా! ఈ దేశాన్ని ద్వేషిస్తూ ఇక్కడెందుకు?" అన్నాడు సావిత్రి భర్త.

"అలాగే అనుకుని ఒక ఆరునెలలు శలవుతో లండన్ వెళ్ళాను. కాని అక్కడ ఏం చెయ్యను? ఆ మనుషులు వేరు, నేను వేరు. భాష ఒకటయినా, మా మానసిక వర్తన వేరు. మా ఆలోచనలు వేరు. నేను ఎవరితోనూ కలవలేకపోయాను. మనసు ఈ దేశంకోసం దేవులాడింది. అందుకే తిరిగివచ్చాను. ఈ కొండలు, ఈ చెట్లూ - ఇవికాస్త వుపశాంతినిస్తున్నాయి. కాని వీటినిచూస్తే నాకు అసహ్యం. వీటిని వదల్లేను, వీటిమధ్య ఉండలేను ఈ దేశానికి వచ్చాక జూలీ అలా అయిందని ఈ దేశాన్ని స్త్రీ జాతినీ ద్వేషించకుండా వుండలేను" అన్నాడు దొర.

ఇంక ఆ రాత్రి ఎవరూ పెదిమ మెదపలేదు. రాత్రి నిశ్శబ్దంగా గడిచిపోయింది. సావిత్రి భర్త 'పాపం' అనుకొని నిద్రపోయాడు. సావిత్రి దొరగారి అమాయక ద్వేషాన్ని చూసి జాలిపడింది.

తెల్లవారింది గుడ్ మార్నింగులతో. రైలు కలకత్తా సమీపిస్తోంది.

"మీ రెక్కడికి వెళ్తున్నారు?" అన్నాడు దొర.

"మా కజిన్ పెండ్లి. మూడురోజుల్లో తిరిగి వెళ్ళిపోతాం మద్రాసుకి" అన్నాడు సావిత్రి భర్త.

దోర మాట్లాడలేదు. రైలు చాలా వేగంగా పరుగెడుతోంది. సావిత్రి దోరవంక చూస్తోంది. రైలు పరుగెట్టి పరుగెట్టి హౌరాలో ఆగింది. దోర సామాన్లు దించేందుకు ప్యూన్లూ సావిత్రీవాళ్ళ సామాన్లు దించేందుకు పెళ్ళివారి మనుషులూ వచ్చారు.

ప్లాట్‌ఫారమ్‌మీద ప్రయాణీకులు విడిపోతున్నారు. దోర సావిత్రి భర్తకి షేక్‌హాండ్ ఇచ్చాడు. సావిత్రికి గమ్మత్తుగా నమస్కారం చేశాడు.

"మీకు బెంగాలీ వచ్చా?" అంది సావిత్రి.

"ఆ ఎందుకు?" అన్నాడు దోర.

"బెంగాలీ రాకపోయినా ఇబ్బందిలేదు. ఇంగ్లీషులో కూడా దొరుకుతాయి. వంగసాహిత్యంలో శరత్ అని ఒక రచయిత వున్నాడు. అతని పుస్తకాలు చదవండి. అప్పుడు మీకు స్త్రీ అంటే ఏమిటో తెలుస్తుంది" అని అనేసి, భర్త వెనకనే నడిచింది భారత స్త్రీ సావిత్రి.

సావిత్రి మాటలు జీర్ణంచేసుకుంటూ, అలా ఆ జంట వంక చూస్తూ నిల్చుండిపోయాడు దోర.

—o—